క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: సీతాఫల్‌మండి, కిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సీతాఫల్‌మండి ఫీడర్ పరిధిలోని వెల్ఫేర్ అసోసియేషన్, ఎల్ఎన్ టవర్, ఆంధ్రాబ్యాంక్, త్రినేత్ర, గణేష్ టెంపుల్, క్లాసిక్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలు. 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాంధీ విగ్రహం ఫీడర్ పరిధిలోని గాంధీ విగ్రహం, ఎంసీహెచ్ పార్కు, లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్, ఈ–సేవా, బొందలగడ్డ, బ్యాంక్ ఆఫ్ బరోడా.

కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు కృష్ణానగర్, బాపూబాగ్ గ్రీన్ గేట్, ప్రశాంత్ అపార్ట్‌మెంట్, హరినివాస్ హనుమాన్ టెంపుల్ ప్రాంతాలు. 2.30 గం.నుంచి సాయంత్రం 6 గం.వరకు భరణి కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని భరణి కాంప్లెక్స్, సింధీకాలనీ, ఎంజీ శ్యామ్, అశోక భూపాల్ చాంబర్స్, సురభి కాంప్లెక్స్, అశోక బిల్డర్స్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న రాజేందర్‌యాదవ్

సికింద్రాబాద్: బోనాల జాతర వేడుకలు పురస్కరించుకుని మెట్టుగూడ డివిజన్ ఆలుగడ్డబావిలోని ఓరుగంటి ఎల్లమ్మ ఆలయ ఆధునీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆలయంలో ఫ్లోరింగ్ నిర్మాణం కోసం అడవయ్య ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ర్యాల రాజేందర్‌యాదవ్ శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ.75 వేల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మహేందర్‌యాదవ్, బాలమణి, సురేఖ, ఆలయ కమిటీ ప్రతినిధులు బాలరాజు, లక్ష్మీనారాయణ, రామస్వామి పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

పద్మారావునగర్: ముదిరాజ్ కులస్తులను అవమానపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సికింద్రాబాద్ న్యూబోయిగూడ ముదిరాజ్ సంఘం ఎదుట కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అహంకారపూరితంగా వ్యవహరించి కౌశిక్‌రెడ్డిపై వెంటనే సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పకుంటే ముదిరాజ్ కులస్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీనివాస్, శారదా పాల్గొన్నారు.

జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో..

కంటోన్మెంట్: ముదిరాజ్‌లను అవమానించిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నాగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ సేవా సమితి సభ్యులతో కలిసి శనివారం జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పిట్ల నాగేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను అవమానించిన ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, సంతోష్, నీలకంఠం, ప్రేమ్, త్రివేణి, దేవి, శ్యామ్, రఘు, బాలరాజ్, రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అమీర్‌పేట: బల్కంపేట శంకర నేత్రాలయం వైద్యులు డాక్టర్ రవీందర్‌గౌడ్ త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. శనివారం ఆయన మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిశారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో త్వరలో పార్టీలో చేరతానని స్పష్టం చేశారు. తెలంగాణాలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కంటోన్మెంట్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ కుమార్ అన్నారు. సికింద్రాబాద్ టివోలీ చౌరస్తాలోని అక్షర వాగ్దేవీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్‌వెస్టిట్యూర్ సెరిమెనీ (పట్టాభిషేక మహోత్సవం) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్కూలు కేబినెట్ సభ్యులుగా ఎంపికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే సామాజిక స్థితిగతుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. ఆర్‌జీఆర్ సిద్ధాంతి విద్యా సంస్థల వైస్ చైర్మన్ పీఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగానే ప్రస్థానం మొదలుపెట్టిన తన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ, ప్రిన్సిపాల్ వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటం.. ఇంటింటికీ దర్శనభాగ్యం

- నేటి నుంచి ఘటం ఎదుర్కోలు ప్రారంభం
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటంపై ప్రత్యేక కథనం



బన్సీలాల్‌పేట్: లష్కర్ బోనాలు అనగానే కొత్తకుండలో ప్రత్యేకంగా వండిన ప్రసాద నైవేద్యం.. డప్పుల దరువులు.. పోతరాజుల విన్యాసాలు ఫలహార బండ్ల ఊరేగింపులు గుర్తుకు వస్తాయి. కానీ.. జాతరలో ప్రతి ఇంటికీ వెళ్లి భక్తులకు దర్శనభాగ్యం కల్పించే ఘటం అత్యంత కీలకమైంది. పొడవైన వెదురు బద్దలతో నిలువెత్తు ఆకారంతో పూలతో అందంగా తీర్చిదిద్ది నడుమ అమ్మవారి విగ్రహాన్ని అమర్చి ఆకర్షణీయంగా రూపొందించేదే ఘటం. ఒంటినిండా పసుపు పూసుకున్న వ్యక్తులు ఘటాన్ని అధిరోహించి తలపై ఉన్న ఘటం కింద పడకుండా డప్పుల దరువులకు అనుగుణంగా నాట్యమాడుతుంటారు.

13 రోజులు..

సుమారు 60 కిలోల బరువుతో ఉన్న ఘటాన్ని కేవలం పసుపు ముద్ద..తలచుట్టకు మధ్యన పెట్టి పడకుండా చూడాల్సి ఉంటుంది. సికింద్రాబాద్‌లో 15కు పైగా ఆలయాలకు సంబంధించిన అమ్మవారి ఘటాలు ఈ రకంగా 13 రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిస్తుంటాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు జూలై 9 ఆదివారం బోనాలు, 10న రంగం ఉంటుంది. ఇందు కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని పేర్కొన్నారు. అమ్మవారి బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని లష్కర్ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే ఆయా విభాగాల అధికారులతో చర్చించడం జరిగిందన్నారు.

ఎదుర్కోళ్ల నుంచి జాతర ముగిసే వరకూ..

ఆషాఢమాసం తొలి ఆదివారం ఈ నెల 25న (నేడు) సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు ఉత్సవాల్లో పాల్గొంటుంది. సోమసుందరం వీధిలోని దేవి పోచమ్మ, కళాసిగూడలోని మాతా ముత్యాలమ్మ, శివాజినగర్‌లోని డొక్కలమ్మ, రెజిమెంటల్ బజార్‌లోని గండిమైసమ్మ, ఓరుగంటి ఎల్లమ్మ, సెకెండ్ బజార్‌లోని ముత్యాలమ్మ, పీనుగుల మల్లన్న, కుమ్మరిగూడలోని నల్లపోచమ్మ, ఆర్పీ రోడ్డులోని మావురాల పెద్దమ్మ వంటి అమ్మవారి ఘటాలు కూడా ఎదుర్కోలు ఉత్సవాల్లో వేర్వేరుగా పాల్గొంటాయి. ప్రధానంగా సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటం బోట్స్‌క్లబ్ సమీపంలోని బుద్ధభవన్ ఎదురు సందులో ఉన్న మహంకాళమ్మ దేవాలయంలో రూపుదిద్దుకుంటుంది. ఆ తర్వాత జూలై 8 శనివారం రాత్రి వరకు ఆయా బస్తీలు, కాలనీల్లో ఊరేగుతూ భక్త జనుల పూజలు అందుకుంటాయి. 9 ఆదివారం బోనాల పండుగ రోజు ఉజ్జయిని మహంకాళి మినహా ఇతర ఘటాలు ఆనకట్ట ఉత్సవాల్లో పాల్గొంటాయి. 10వ తేదీన రంగం కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారి ఘటం వీడ్కోలు ఉత్సవంలో పాల్గొంటుంది. దీంతో జాతర పరి సమాప్తమవుతుంది.

ఇది ఘటం అసలు కథ..

తొలినాళ్లలో ఘటం అనేది ఉండేది కాదు. ప్రధానంగా 1813లో సురిటి అప్పయ్య అనే మిలటరీ ఉద్యోగి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతంలో విధులు నిర్వహించే వారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కలరా వ్యాధి సోకి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కలరా వ్యాధి తగ్గితే సికింద్రాబాద్‌లో ఆలయాన్ని కడతానని మొక్కుకున్నారు. ఆ తరువాత సికింద్రాబాద్‌లో ఆలయాన్ని నిర్మించారు. అయితే దివ్యాంగులు, వృద్ధుల వంటి ఆలయానికి రాలేని వారికి ఇంటి వద్దే అమ్మవారి దర్శనభాగ్యం కల్పించేందుకు అమ్మవారి ఘటాన్ని తయారు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం దేవాలయంలో ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ప్రధానంగా బోనాలతో వచ్చే భక్తుల కోసం బాటా నుంచి రెండు క్యూలైన్లు, రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి మరో క్యూలైన్ ఏర్పాటు చేసి వేగంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ రమేష్, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: గత ఐదారు దశాబ్దాలుగా జరగని అభివృద్ధి పనులు బీఆర్ఎస్ హయాంలో జరిగాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ పరిధి సుభాష్‌నగర్, కైలాష్‌నగర్‌లలో అధికారులతో కలిసి శనివారం ఆయన పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంతో మంది ప్రాణాలను బలిగొన్న సుభాష్‌నగర్ హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు ఎంతగా మొరపెట్టుకున్నా గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించినట్లు వివరించారు. కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కును సుమారు రూ.4 కోట్ల వ్యయంతో అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని ఈఎస్ఐ శ్మశానవాటికను కూడా రూ.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. బల్కంపేట అమ్మవారి ఆలయాన్ని ఎంతో అభివృద్ధి పర్చామని రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఆలయ ఆదాయం రూ.4 కోట్లు ఉండగా నేడు రూ.22 కోట్లకు పెరిగిందన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఎలక్ట్రికల్ డీఈ శేఖర్, ఏడీఈ అమర్నాథ్, స్ట్రీట్ లైట్ అధికారి కిరణ్మయి పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

అమీర్‌పేట: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. అమీర్‌పేట డివిజన్ పార్కు ఎవెన్యూ కాలనీలో రూ.3.5 లక్షలతో అభివృద్ధి చేసిన రెండు పార్కులను శనివారం ఆయన ప్రారంభించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాలనీలో పర్యటించగా పార్కులలో నెలకొన్న సమస్యలను స్థానికులు తమ దృష్టికి తీసుకురాగా వారికిచ్చిన హామీ మేరకు పనులను పూర్తి చేశామన్నారు. పార్కు వెంట ఉన్న నాలా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మంత్రి వెంట నామన శేషుకుమారి, అధికారులు మోహన్‌రెడ్డి, ఇందిర, మోహన్, హరి శంకర్, హనుమంతరావు, గులాబ్‌సింగ్, సంతోష్ ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి..

బన్సీలాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి తలసాని పేర్కొన్నారు. భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 1.15 కోట్లు మంజూరు అయిన సందర్భంగా శనివారం మంత్రిని కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మనబడి–మనబస్తీ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, సదుపాయాలను మెరుగుపర్చడమే కాకుండా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత..

సనత్‌నగర్: ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీలో ఉంటున్న రామ్‌సాయి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.4 లక్షల ఎల్‌ఓసీ చెక్కును శనివారం మంత్రి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు పుష్పలత, రుక్మిణిరెడ్డి పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్




వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపించడం కోసమే వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. నామాలగుండు కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన సీతాఫల్‌మండి డివిజన్ వార్డు కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, పౌర సేవలకు సంబంధించిన అవసరాల నిమిత్తం జీహెచ్ఎంసీ, జలమండలి కార్యాలయాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అన్ని రకాల సమస్యల పరిష్కారం , ధృవీకరణలకు సంబంధించి వార్డు కార్యాలయాల్లోనే సంప్రదించాలన్నారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమయం వృథా కాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ల వారీగా వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. అన్ని విభాగాల అధికారులను వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ దశరథ్, కార్పొరేటర్ సామల హేమ, ఇంజినీరింగ్ అధికారులు ఆశాలత, సంధ్య, కౌశిక్, జలమండలి డీజీఎం వై.కృష్ణ, ఏఈ అన్విత్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ సరికొండ మట్టంరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మధురానగర్, టీఆర్‌టీ కాలనీల్లోని పార్కుల ఆధునీకరణ పనులను కార్పొరేటర్ సామల హేమతో కలిసి డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ ప్రారంభించారు. అభివృద్ధి పనులతోపాటు పార్కుల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురి శస్త్ర చికిత్సల నిమిత్తం మెట్టుగూడ, సీతాఫల్‌మండి డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రూ. 5 లక్షల సీఎం సహాయనిధికి సంబంధించి పత్రాలను అందించారు.

మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు



మధిరలో ఆర్‌పీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

సికింద్రాబాద్: రైళ్లలో మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడంలో రైల్వే రక్షణ దళం బృందాలు పకడ్బందీ చర్యలు తీసుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని సికింద్రాబాద్ డివిజనల్ ఆర్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబస్మిత చటోపాధ్యాయ బెనర్జీ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను గతేడాది కన్నా రెట్టింపు మొత్తంలో ఈ ఏడాది జూన్ వరకే స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 23న మధిర, ఖమ్మం ఆర్‌పీఎఫ్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో 41కిలోల గంజాయి బ్యాగులను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ పోలీసులు ఈ ఏడాదిలో రూ.2.43 కోట్ల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె ప్రకటించారు.గంజాయిని స్వాధీనంతో పాటు 10 మంది అక్రమ రవాణాదారులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆపరేషన్ నార్కోస్ పేరుతో ఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రత్యేక శిక్షణను ఇవ్వడం ద్వారా రైళ్లలో మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం

హోం మంత్రి మహమూద్ అలీ



విద్యార్థులకు అల్పాహారాన్ని అందించిన హోంమంత్రి

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. నల్లగుట్టలోని జియాఉల్ ఇస్లాం హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు విద్యార్థులకు ఉచితంగా న్యూట్రిషన్ అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యనందించాలనే ఉద్దేశ్యంతో 204 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించారని అలాగే ముస్లిం మైనార్టీలకు కూడా అనేక పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వారు అన్ని రంగాల్లో రాణించేందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ముఖ్యంగా బాలికల విద్యకు కేసీఆర్ మరింత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు సొసైటీ ద్వారా అతి తక్కువ ఫీజులతో విద్యను అందించడంతో పాటు ఉచితంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించడం పట్ల ఆయన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. జియా ఉల్ ఇస్లామిక్ సొసైటీ చైర్మన్ మసూద్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ.. 1899లో కేవలం 7 మంది విద్యార్థులతో మొదలైన పాఠశాల ఇప్పుడు వేల మంది పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో విద్యనందించి వారిని ఉన్నత స్థానాలకు తీసుకుని వెళ్లిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు జాఫర్ జావీద్, జియా ఉల్ ఇస్లామిక్ సొసైటీ కార్యదర్శి ఖాదీర్ ఉపాధ్యక్షులు సల్మాన్ ఫారుఖ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 4/5 ప్లాట్‌ఫాంపై స్పృహ తప్పిపడిపోయిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 85 ఏళ్ల వయసున్న మహిళ ప్లాట్‌ఫాంపై శుక్రవారం అర్ధరాత్రి అచేతనంగా పడి ఉన్నట్టు గుర్తించిన రైల్వే సిబ్బంది అంబులెన్స్‌ను రప్పించి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

పాలక మండలి సభ్యురాలికి సన్మానం



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా దర్శనం కోసం వచ్చి స్పృహ తప్పి పడిపోయిన భక్తురాలికి ప్రాథమిక చికిత్స చేసిన పాలక మండలి సభ్యురాలిని ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సన్మానించారు. భక్తుల రద్దీ కారణంగా కల్యాణం రోజు తీవ్ర ఇబ్బందులు పడ్డ భక్తులను గుర్తించి శనివారం అమ్మవారి దర్శనం చేయించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారి ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ.. వేడుకలకు ఎక్కువ మంది భక్తులు రావడంతో అక్కడక్కడ ఇబ్బందులు తలెత్తాయని సభ్యురాలైన పుష్పలత భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూశారని తెలిపారు. ఈ సమావేశంలో చైర్మన్ సాయిబాబాగౌడ్ సభ్యులు సంతోష్, నర్సింహ, సురేష్‌గౌడ్, రోజారెడ్డి, ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రభాకర్ అంత్యక్రియాలు



రసూల్‌పురా: బోర్డు మాజీ సభ్యుడు బి. ప్రభాకర్‌కు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఉద్యమ నేత నీకు వందనం..అమరుడా నీకు వందనం అంటూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, వైద్య మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, మర్రి రాజశేఖర్ రెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ప్రొ.మోహన్‌సింగ్‌కు నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ ప్రిన్సిపల్ దివంగత ప్రొ.మోహన్ సింగ్‌కు హిందీ అధ్యాపకులు నివాళి అర్పించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన సంస్మరణ సభకు ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ అధ్యక్షత వహించగా ఓయూ అధ్యాపకులతో పాటు వివిధ కాలేజీల అధ్యాపకులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగం హెడ్ ప్రొ.మాయ, ఉన్నత విద్య జేడీ ప్రొ.రాజేందర్‌సింగ్, ప్రొ.అజయ్, ప్రొ.జైకిషన్, ప్రొ.ధరంపాల్, ప్రొ.జగన్ పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి

లాలాపేట: వర్షాకాలంలో తలెత్తే సమస్యల నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆమె జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాలాల్లో పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లు, డ్రైనేజీలను తరుచూ పరిశీలిస్తుండాలన్నారు. రోడ్లపై వర్షం నీరు నిలువకుండా చూడాలని మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

బౌద్ధనగర్: బక్రీద్ పండుగను ప్రశాంతం వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరారు. శనివారం బౌద్ధనగర్‌లోని చిలకలగూడ ఏసీపీ కార్యాలయంలో మైనారిటీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చిలకలగూడ ఏసీపీ శ్రీనివాస్, కార్పొరేటర్లు కంది శైలజ, హేమ, ఇన్‌స్పెక్టర్లు శంకర్, మట్టంరాజు పాల్గొని మాట్లాడారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. పండగ సందర్భంగా నిర్వహించే ఖుర్బానీ వ్యర్థాలను రోడ్లు, డ్రైనేజీలో వేయకూడదని జీహెచ్ఎంసీ అందజేసే పాలిథిన్ కవర్లలో మాత్రమే వేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు.



సమావేశంలో పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రపంచ దేశాలకు దిక్సూచిగా భారత్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: సేవ, సుపరిపాలన, ప్రజల సంక్షేమం, అభివృద్ధిలో నేడు భారత్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని, ఇందుకు ప్రధాని మోదీ నిర్ణయాలే కారణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మోదీ తొమ్మిదేళ్ల పాలనపై సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని లోధా అపార్ట్‌మెంట్‌లో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లోధా అపార్ట్‌మెంట్ నివాసితులు పలు సమస్యలను కేంద్ర మంత్రికి విన్నవించారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణ జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా అపార్టమెంట్స్‌లో అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాలు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని, లోధా నివాసితుల సమస్యలు పరిష్కారం జరిగేలా చూస్తానన్నారు. ప్రధానమంత్రి మోదీ పనితనాన్ని, పాలనా విధానాలను ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేటలో గడప గడపకూ బీజేపీ

లాలాపేట: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం తార్నాక డివిజన్ లాలాపేటలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లాలాపేట పోలింగ్ బూత్ 96, 97 ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్‌రావు, శ్రీనివాస్‌చారి, రాముపర్మ, వెంకటేష్‌గౌడ్, పోచయ్య, అనిత పాల్గొన్నారు.

లాలాగూడలో..

అడ్డగుట్ట: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం బీజేపీ నాయకులపై ఉందని కార్తీక రెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని లాలాగూడలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, వీరన్న, శారదా మల్లేష్, జ్యోతి, సంపత్, కరుణాకర్, సంతోష్ పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. సీ–సెక్షన్‌లో సీవరేజీ పైప్‌లైన్, మెట్లదారి పనులు, డీ–సెక్షన్‌లో కమ్యూనిటీహాల్ పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేస్తున్నామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వేణు, జలమండలి ఏఈ స్రవంతి, నేతలు శ్రీనివాస్, సత్తయ్య, మనోహర్, ఎల్లయ్య, గౌస్, మహ్మద్, రాజు, అమర్, రవి, నర్సింగ్, వసంత, గోపి, అయోధ్య, రామస్వామి పాల్గొన్నారు.